## క్లుప్తంగా

### జాతరకు నిరంతర విద్యుత్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో మంగళ, బుధ వారాల్లో నిర్వహించనున్న గంగమ్మ జాతరకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయనున్నట్టు ట్రాన్స్‌కో డీఈ శేషాద్రి తెలిపారు. సాధారణంగానే నగరంలో కోతలు లేవన్నారు. అమ్మవారిని ప్రతిష్ఠించిన చోట క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్య వచ్చినా తగు చర్యలు తీసుకుంటారన్నారు.

### జాతరకు రండమ్మా!



ఇందుమతికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించనున్న గంగమ్మ జాతరకు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సతీమణి ఇందుమతిని నిర్వాహకులు ఆహ్వానించారు. సోమవారం ఆమె నివాసంలో నాయకులు కలిశారు. గిరింపేట, కొంగారెడ్డిపల్లె, దొడ్డిపల్లె, మురకంబట్టులో అమ్మవారి దర్శనం కోసం రావాలని నిర్వాహకులు డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, సునీత, నవీన్‌కుమార్ తదితరులు ఆహ్వానించారు.

### మొగిలిలో ఘనంగా రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించినట్లు ఈఓ మునిరాజులు తెలిపారు. ఈ సందర్భంగా స్వయంభు మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దోష నివారణ పూజలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలి



వ్యాపారులతో సమీక్షిస్తున్న కార్యదర్శి వెంకటరమణ

బంగారుపాళెం: మామిడి వ్యాపారులు లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలని ఏఎంసీ కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన మార్కెట్ యార్డ్ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యాపారులు నిబంధనలు పాటించి వ్యాపారాలు సాగించాలన్నారు. వ్యాపారులు మార్కెట్ యార్డ్‌లో షెడ్ల నిర్వాహణకు సంబంధించి అద్దె బకాయిలను చెల్లించాలన్నారు. ఈ నెల 24వ తేదీలోపు అద్దెబకాయిలను చెల్లించి, లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### రథోత్సవం



చౌడేపల్లె: స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదిదేవుడుగా పేరొందిన పార్వతీ పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పుష్పాలంకరణకు ఉభయదారులుగా మల్లిశెట్టి శివశంకర్, శ్రీదేవి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. మేళ తాళాలు, కళాకారుల కోలాటాల నడుమ స్వామివారు రథంపై ఆశీనులపై పురవీధుల్లో విహరించారు. దీనికి బలిజ సంఘం ఉభయదారులుగా వ్యవహరించింది. భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రెడ్డిప్రకాష్, వరుణ్ భరత్, జీవన్ ప్రకాష్, కడియాల మురళి, మహేష్‌బాబు, నాగబాల గణేష్, బి. మురళి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### శేష వాహనంపై విహారం

సదుం: మండలంలోని బూరగమందలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం అభిషేకాలు, విశేషాలంకారం, సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను శేషవాహనంపై మేళ తాళాలతో గ్రామంలో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

# చిత్తూరు గెలుపులో ఆ రెండే కీలకం!

- గుడిపాలలో 78, రూరల్‌లో 90, చిత్తూరు కార్పొరేషన్‌లో 89 శాతం పోలింగ్
- గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 40 వేల పై చిలుకు మెజారిటీ
- ఈసారి గుడిపాల, రూరల్ ఓట్లే గెలుపుపై ప్రభావం



చిత్తూరు మండలంలో పోలింగ్ రోజున క్యూకట్టిన ఎల్‌బి.పురం వాసులు (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజవకర్గంలో ఈసారి జరిగిన పోలింగ్ పరిశీలిస్తే.. అభ్యర్థి గెలుపులో చిత్తూరు రూరల్, గుడిపాల మండలాలు కీలక పాత్ర పోషించనున్నాయి. 2019 ఎన్నికల ఫలితాల్లో చిత్తూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వచ్చిన మెజారిటీ 40 వేల పైచిలుకు ఓట్లే వచ్చాయి. ఈసారి అభ్యర్థుల గెలుపులో చిత్తూరు రూరల్, గుడిపాలలో పడ్డ ఓట్లు కీలకంగా నిలిచే అవకాశం ఉంది.

**చిత్తూరులో 89 శాతం**

చిత్తూరులోని 50 డివిజన్లలో 150 పోలింగ్ కేంద్రాలుంటే 69,391 మంది పురుషులు, 73,864 మంది మహిళలు, 29 మంది ఇతరులు ఉన్నారు. మొత్తం కలిపి నగరంలో 1,43,284 మంది ఓటర్లుగా ఉన్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరులో 89.28 శాతం పోలింగ్ నమోదైంది. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో మహిళలు 57,208, పురుషులు 54,208, ఇతరులు 15 మంది ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏకంగా 28,464 ఓట్లు మెజారిటీగా వచ్చింది. ఈసారి 1,11,420 మంది చిత్తూరు నగరం నుంచి ఓటు హక్కు వినియోగించుకోవడం, గత ఎన్నికలతో పోలిస్తే 2 శాతం ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి. మరి ఈసారి చిత్తూరు నగర వాసులు ఎవరివైపు నిలుస్తారనేది చూడాల్సి ఉంది.

**ఆ రెండు చోట్ల..**

ఇక గుడిపాలలో 35,253 మంది ఓటర్లు ఉంటే, ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 31,392 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 15,964 మంది మహిళలు, 15,426 మంది పురుషులు ఉన్నారు. ఇక్కడ 78 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో గుడిపాలలో వైఎస్సార్‌సీపీకి వచ్చిన మెజారిటీ 7086 ఓట్లు. చిత్తూరు రూరల్ మండలంలో 24,313 మంది ఓటర్లు ఉంటే.. ఈసారి 21,976 మంది ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. వీరిలో మహిళలు 11,106 మంది, పురుషులు 10,870 మంది ఉన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా చిత్తూరు మండలంలో 90.5 శాతం పోలింగ్ నమోదవడం విశేషమే.

**తీర్పు ఎవరి పక్షమో..?**

చిత్తూరు నియోజకవర్గంలో మొత్తంగా పోలింగ్ 81 శాతం దాటడం, అందులోనూ పురుషుల (80,493) కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా (84,278) ఓటింగ్‌లో పాల్గొనడం చూస్తుంటే అభ్యర్థి గెలుపులో మహిళా ఓటర్లు కీలకంగా నిలవనున్నారనే విషయం స్పష్టమవుతోంది. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి 40 వేల పైచిలుకు వచ్చిన మెజారిటీలోనూ మహిళలు అండగా నిలిచారన్నది సుస్పష్టం. ఈసారి ఇదే సెంటిమెంట్ పునరావృతం అవుతుందా? అనేది తెలియాలంటే మరో రెండు వారాలు ఆగి చూడాల్సిందే.

# ప్రశాంత వాతావరణంలో జాతర ముఖ్యం



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

- భక్తులకు ఇబ్బంది లేకుండా చూడండి
- శాంతి భద్రతల సమస్య తలెత్తరాదు
- సమష్టి కృషితో విధులు నిర్వర్తించండి
- ఎస్పీ మణికంఠ ఆదేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్న గంగజాతరలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. గంగజాతర నేపథ్యంలో బందోబస్తు కేటాయించిన అధికారులు, సిబ్బందితో సోమవారం చిత్తూరులోని ఏఆర్ మైదానంలో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రెండు రోజుల పాటు జరిగే గంగజాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందన్నారు. జనం ఎక్కువగా ఉన్న చోట జేబు దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌కు అవకాశం లేకుండా నిఘా ఉంచాలన్నారు. శాంతి భద్రతలకు ఎక్కడా సమస్య తలెత్తకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు ఇక్కడి పరిస్థితి వివరించాలన్నారు. ఇక ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడ మళ్లించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో జాతర జరిగేలా పోలీసుశాఖ సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



హాజరైన పోలీసులు

# పారదర్శకంగా వేరుశనగ విత్తన పంపిణీ





బంగారుపాళెం: వేరుశెనగ విత్తన కాయలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, తవణంపల్లె: పంపిణీకి సిద్ధంగా ఉన్న వేరుశనగ విత్తనాలు

బంగారుపాళెం: వేరుశనగ విత్తన కాయల పంపిణీని పారదర్శకంగా చేపట్టాలని చిత్తూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు ఉమ అన్నారు. సోమవారం బంగారుపాళెంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో మండలంలోని రైతుభరోసా కేంద్రం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల ద్వారా వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా చేపట్టాలన్నారు. ఏఓ చిట్టిబాబు మాట్లాడుతూ మండలానికి 1,980 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు 1334.4 క్వింటాళ్ల కే–6 రకం వేరుశనగ విత్తన కాయాలు వచ్చాయన్నారు. వేరుశనగ విత్తన కాయలు అవసనమైన రైతులు ఈ నెల 23వ తేదీ నుంచి ఆయా ఆర్బీకేలలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, మొబైల్ తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ రాయితీ పోను 30 కేజీల బస్తా రూ.1,710కు విక్రయించనున్నట్లు తెలిపారు. అనంతరం రైతుభరోసా కేంద్రంలో వేరుశనగ విత్తన కాయలను ఏడీ ఉమ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

**పంపిణీకి సిద్ధంగా వేరుశనగ విత్తనాలు**

తవణంపల్లె: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు ఈ నెల 23వ తేదీ నుంచి పంపిణీ చేయడానికి వేరుశనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏఓ ప్రవీణ్ తెలిపారు. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 2,193 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేయాలన్నది లక్ష్యమన్నారు. మండలానికి 1,710 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరమని, ఈ మేరకు ఇండెంట్ పెట్టినట్లు తెలిపారు. మండలానికి ఇప్పటి వరకు 1,600 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా కాగా మండలంలోని 17 ఆర్‌బీకేల్లో నిల్వ ఉంచినట్లు పేర్కొన్నారు.

### గంగ జాతర ఏర్పాట్ల పరిశీలన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించనున్న గంగ జాతర పండుగ ఏర్పాట్లను మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ పరిశీలించారు. సోమవారం బజారువీధి, సంతపేట, కొంగారెడ్డిపల్లె, గిరింపేట తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాతర సమయంలో 580 మంది పనిచేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. పారిశుద్ధ్య పనులు, ఇంజినీరింగ్ సిబ్బంది విధుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రామకృష్ణుడు, మునిసిపల్ ఇంజనీరు గోమతి, డీఈలు వెంకటప్రసాద్, రమణ, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# కాణిపాకంలో సింహాచలం కార్యనిర్వాహధికారి

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని సోమవారం సింహాచలం దేవస్థానం కార్యనిర్వాహధికారి శ్రీనివాసమూర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం కల్పించారు. వారికి వేదపండితులు ఆశీర్వచనాలు పలికి, ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయాధికారులు కోదండపాణి, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటం అందజేస్తున్న ఆలయాధికారులు

# గరుడాద్రి కొలువులో జగన్మోహనాకారుడు



జగన్మోహిని అవతారంలో కోనేటిరాయుడు





భక్తజన సందడి నడుమ కోనేటిరాయుని కల్యాణోత్సవం

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో 5వ రోజు సోమవారం ఉద యం అభయ ప్రధాత స్వరూపుడైన శ్రీనివాసుడు జగన్మోహినీ అవతారంలో తిరుచ్చిపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. స్వామివారి తిరుచ్చి ముందు భక్త బృందాలు, డప్పు వాయిద్యా లు, సంగీతాలాపనతో స్వామివారిని కీర్తిస్తూ మంగళవాయిద్యాల నడుమ శ్రీవారి ఉత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. తొలుత స్వామివారి సుప్రభాతం, తోమాల సేవ, అర్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**గరుడుని భుజ స్కంధాలపై కోనేటిరాయుడి దర్శనం**

ఉత్సవాల్లో ఇదే రోజు రాత్రి సర్వాలంకార భూషితుడైన శ్రీ కోనేటిరాయుడు గరుత్మంతుని భుజ స్కంధాలపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. సమస్త వాహనాల్లో సర్వ శ్రేష్ఠమైన గరుడ వాహనంపై ఊరేగే స్వామివారిని దర్శిస్తే సమస్త భోగభాగ్యాలు, శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో శ్రీవారి గరుడసేవకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి పారవశ్యంలో మునిగితేలారు.

**కమనీయంగా కోనేటిరాయుని కల్యాణోత్సవం**

కీలపట్ల శ్రీ కోనేటిరాయుని కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఆస్థాన మండపంలో ప్రత్యేక కళ్యాణవేదికపై కొలువుదీర్చి, వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణ, మంగళవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. కల్యాణోత్సవంలో భజన బృందాలతోపాటు హిందూ ధర్మ పరిషత్ కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.



# ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



వెంకటాపురంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని వెంకటాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్న సంకల్పంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. అలాగే గర్భిణులు, బాలింతలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు చేయించి మందులు అందజేశారు. తవణంపల్లె పీహెచ్‌సీలో ప్రసవాలు చేస్తున్నామని, ఈ సదుపాయాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, వేదవతి, ఎంఎల్‌హెచ్‌పీ జాహ్నవి, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతరకు సర్వం సిద్ధం

- నేడు, రేపు గంగజాతర
- మంగళవారం వేకువజామున తొలిపూజ
- బుధవారం నిమజ్జనం
- ఏర్పాట్లు పూర్తి
- చిత్తూరులో జాతర సందడి



నడివీధిలో పూర్తయిన జాతర ఏర్పాట్లు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గంగజాతరకు ముస్తాబైంది. పలు చోట్ల మండపాలు కొలువుదీరాయి. విద్యుత్ దీపాలంకరణలతో వీధులన్నీ కళకళలాడుతున్నాయి. భారీ ఏర్పాట్లతో గంగమ్మ దర్శనమిచ్చేందుకు సిద్ధమైంది. మంగళ, బుధవారాల్లో గంగజాతరను అట్టహాసంగా నిర్వహించనున్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. దీంతో చిత్తూరు నగరంలో జాతర సందడి నెలకొంది. జాతర సందర్భంగా మండపాల ఏర్పాటు నుంచి అలంకరణ, విద్యుత్ లైట్ల సెట్టింగ్, కటౌట్‌లు ఏర్పాటు చేస్తారు. దీంతో చిత్తూరు గంగజాతర అంటే పక్క రాష్ట్రాలు సైతం చిత్తూరు వైపు చూస్తుంటాయి. బంధువులరాకతో ఊరంతా కళకళలాడుతోంది.

**నేడు తొలిపూజ**

నడివీధిలో గంగమ్మ తల్లిని మంగళవారం వేకువజామున 4 గంటల ప్రాంతంలో కొలువుదీర్చానున్నారు. వంశపారంపర్య ధర్మకర్తల చేతుల మీదుగా తొలిపూజ నిర్వహించి, లాంఛనంగా తెర తొలగించనున్నారు. విశేష పూజలు చేయనున్నారు. ఆ తర్వాత భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి అమ్మవారికి నైవేద్యంగా అంబలి సమర్పించనున్నారు. గంగమ్మను దర్శించుకుని చీరలు, ఇతరాత్ర వస్తువులను సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. రాత్రికి కుంభ నైవేద్యం, విశేష పూజలు కొనసాగుతాయి.

**పలు చోట్ల...**

సంతపేటలో కూడా గంగజాతర ఏర్పాట్లు భారీ స్థాయిలో చేశారు. మంగళవారం 4 గంటలకు శిరస్సును ఊరేగించనున్నారు. ఉదయం 5 గంటలకు తెర తొలగించి జాతరను ప్రారంభించనున్నారు. 7 గంటలకు విశేష పూజలు జరుగుతాయి. అలాగే కొంగారెడ్డిపల్లెలో కూడా ఏర్పాట్లు పూర్తి చేశారు. మురకంబట్టు, దొడ్డిపల్లె, గిరింపేట, ఓబనపల్లె ప్రాంతాల్లో కూడా గంగజాతరను ప్రారంభించి విశేష పూజలు చేయనున్నారు.

**నిమజ్జనం..**

నగరంలోని అన్నిచోట్ల బుధవారం సాయంత్రం నిమజ్జనోత్సవం ప్రారంభమవుతుంది. ముందుగా ఆయా గ్రామ దేవతల వద్ద ప్రత్యేక పూజలు చేసి నిర్వాహకులు, వంశ పారంపర్య ధర్మకర్తలు సారె సమర్పిస్తారు. అనంతరం అమ్మవారికి గజమాల సమర్పించి, నగర వీధుల్లో ఊరేగిస్తారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు వాయిద్యాలు, కేరళ వాయిద్యాలను ఏర్పాటు చేయనున్నారు. చివరగా కట్టమంచి చెరువులో నిమజ్జనం చేస్తారు.



సంతపేటలో గంగజాతర మండపం



సంతపేటలో జాతర ఏర్పాట్లు, విద్యుత్ దీపాలంకరణ